క్లుప్తంగా

బీరన్న ఆలయానికి రూ.51వేల విరాళం


నగదు అందజేస్తున్న అజయ్‌గౌడ్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బీరన్న ఆలయానికి మాజీ సర్పంచ్ పడాల అజయ్‌గౌడ్ రూ.51వేలు శుక్రవారం సంఘం నాయకులకు అందించారు. ఈ సందర్భంగా అజయ్‌గౌడ్‌కు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మి

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన యాదగిరి పద్మకు రూ.18వేలు, గోస్కుల అఖిలకు రూ.18వేలు, గరిగంటి బాలయ్యకు రూ.12వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. కాగా ఎంపీపీ రాసకొండ లక్ష్మి శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, దండె కనుకరత్నం, బొల్లపెల్లి శంకర్‌గౌడ్, సింగం శ్రీనివాస్, పిట్టల స్వామి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

జూలపల్లి: ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కోనరావుపేట గ్రామానికి చెందిన దివ్యాంగులకు గోదావరిఖని డిపో వారు అందజేసిన ఉచిత బస్‌పాసులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బస్‌పాసులు అందించే ఇన్‌చార్జి కట్ల రాజిరెడ్డి, మల్లారపు అంజయ్య, భూస రజిత పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం


ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీభూలక్ష్మి–మహాలక్ష్మి సమేత బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సాముహిక కుంకుమ పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజయ్యగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయానికి పూజా సామగ్రి బహూకరణ


పూజా సామగ్రి బహూకరిస్తున్న దాతలు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి పూజా సామగ్రిని వీణవంక మండల కేంద్రానికి చెందిన ఆయిత సరిత, పూర్ణచందర్ దంపతులు శుక్రవారం కంకణాల జ్యోతిబసు, ఆలయ పూజారి వెంకటాచార్యులకు బహూకరించారు. రూ.70వేల విలువ కలిగిన వెండి పంచపాత్రలు, తీర్థం గిన్నెను స్వామివారి పూజ కోసం బహూకరించినట్లు దాత పూర్ణచందర్ తెలిపారు.

ధర్మారం తహసీల్దార్‌గా కేవై ప్రసాద్

ధర్మారం: పెద్దపల్లి కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కేవై ప్రసాద్‌ను ధర్మారం తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ సంగీత సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభ ఎన్నికల దృష్ట్యా బదిలీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌ను పెద్దపల్లి కలెక్టరేట్‌కు బదిలీ చేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ఓదెల: మండలంలోని మడక, ఓదెలలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు పెద్దపల్లి హార్టికల్చర్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి పేర్కొఅవగాహన కల్పించారు. మండలంలోని మడకకు చెందిన నోముల వనరెడ్డి భూమిలో శుక్రవారం ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఏఈవోలు సంధ్య, సతీశ్, ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్ పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు కోసం ఎదురుచూపులు

- నిర్మాణానికి నోచుకోని జూలపల్లి–పెద్దపల్లి రహదారి
- 25కిలోమీటర్ల డబుల్‌రోడ్డు కోసం 15ఏళ్లుగా నిరీక్షణ
- అవస్థలు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు


జూలపల్లి: మండల కేంద్రం నుంచి పెద్దపల్లి వెళ్లే రోడ్డు

జూలపల్లి: మండల ప్రజలకు డబుల్‌రోడ్డు నిర్మాణం కలగానే మిగులుతోంది. 15ఏళ్లుగా ఎదురుచూపులు తప్పడం లేదు. డబుల్‌రోడ్డు నిర్మాణానికి సరైన కార్యాచరణ లేక నిధులు మంజూరు కావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్‌రోడ్డు ఉండాలన్న ప్రభుత్వ నిబంధనలు పాటించకపోగా, ప్రతిపాదనలు సైతం ఆచరణకు నోచుకోవడం లేదు.

పాదయాత్ర చేసినా స్పందన శూన్యం..

ప్రతి సమావేశంలో డబుల్‌రోడ్డు నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరై టెండరు ప్రక్రియకు వెళ్తుందన్న హామీలు తప్ప ఆచరణలో కనిపించడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయి. డబుల్‌రోడ్డు నిర్మాణానికి సమాజ్‌వాదీ పార్టీ పాదయాత్ర చేపట్టినా.. స్పందన రావడం లేదని వాపోతున్నారు. ఇప్పటికీ ప్రతి సమావేశంలో డబుల్‌రోడ్డు ప్రస్తావన తప్పనిసరిగా వస్తున్నప్పటికీ స్పందన మాత్రం అంతే. నియోజకవర్గంలో ఎన్నో రోడ్లకు నిధులు వచ్చి నిర్మాణాలు పూర్తయినా జూలపల్లి డబుల్‌రోడ్డుకు మోక్షం రావడం లేదు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు ప్రతిరోజు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తారు. ఇంత ప్రాముఖ్యం ఉన్న డబుల్‌రోడ్డు నిర్మాణానికి అధికారులు వెంటనే అనుమతి సాధించాలని సర్పంచులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో ఇబ్బంది..

ప్రయాణికులు ఇచ్చే పదో పరకతో కుటుంబాలను నెట్టుకొస్తున్న ఆటో డ్రైవర్లకు కష్టాలు తప్పడం లేదు. రోడ్డు చెడిపోయి గుంతలు ఏర్పడి, ఆటోలు త్వరగా చెడిపోతున్నాయని, వచ్చిన డబ్బులు రిపేర్లకే పెట్టాల్సి వస్తోందని అటున్నారు. మూడునెలల క్రితం ప్యాచ్‌వర్క్ చేసినా మరింత ఎత్తేస్తున్నాయని, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో ఆటోలకు గిరాకీ తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

15 ఏళ్లుగా నిరీక్షణ..

పెద్దపల్లి, చందపల్లి, తుర్కల మద్దికుంట, కాచాపూర్, వడ్కాపూర్, జూలపల్లి వరకు వేసే డబుల్‌రోడ్డు మార్గం 25 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణానికి పదిహేనేళ్లుగా మండల ప్రజలు నిరీక్షిస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినా.. రాస్తారోకోలు చేసినా ఫలితం శూన్యం. సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో డబుల్‌రోడ్డు సాధన సమితి పేరుతో గతేడాది సంబంధిత గ్రామాల ప్రజలతో కలిసి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పాదయాత్రను చేపట్టారు. అయినా నేటికీ డబుల్‌రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. ఇప్పటికైనా పెద్దపల్లి, జూలపల్లి డబుల్‌రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డబుల్‌రోడ్డు నిర్మించాలి



ఆటోలు నడుపుకుని జీవనం సాగించే మాకు రోడ్డు చెడిపోవడంతో ఆటోలు త్వరగా చెడిపోతున్నాయి. దీంతో వచ్చిన డబ్బులు ఆటోల రిపేర్‌కే సరిపోతున్నాయి. రోడ్డు నిర్మిస్తే ప్రయాణికులకు, వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది.

– ఒల్లాజి మహేందర్, ఆటో డ్రైవర్

ఇబ్బంది పడుతున్నాం



మండలం నుంచి డబుల్‌రోడ్డు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్డుపై గుంతలు ఏర్పడి ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడికైనా స్కూటర్ మీద వెళ్లాలన్నా..రోడ్డు ఎత్తువంపులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే డబుల్‌రోడ్డు నిర్మించి ప్రజల సమస్య పరిష్కరించాలి.

– జెట్టి కనుకయ్య, ట్రాక్టర్ డ్రైవర్, వడ్కాపూర్

ఆందోళన చేస్తాం



మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రాన్ని కలుపుతూ వెంటనే డబుల్‌రోడు నిర్మాణం చేపట్టాలి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందన రావడం లేదు. డబుల్‌రోడ్డు చేపట్టకుంటే మళ్లీ పాదయాత్ర, ఆందోళన చేస్తాం.

– మారం తిరుపతియాదవ్, సమాజ్‌వాదీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి


ఓదెల: పథకాలు వివరిస్తున్న సురేశ్‌రెడ్డి


జ్యోతినగర్: కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఓదెల: పీఎం నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి గెలిపించాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి కోరారు. మండలంలోని మడకలో శుక్రవారం ఇంటింటా బీజేపీ ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. గ్రామంలోని 153, 154వ బూత్‌లలో బీజేపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటా ప్రచారం చేశారు. పార్టీ నాయకులు కొండపాక నర్సింహచారి, పూదరి సంపత్, తూడి సంపత్, నోముల రమణరెడ్డి, నెదురు రాజయ్య, మధునయ్య, నర్సయ్య, ఆనంద్, ప్రమోద్, రాజయ్య, మనోహర్ పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ కార్యక్రమం

జ్యోతినగర్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం శుక్రవారం ఎన్టీపీసీ రామగుండంలోని అన్నపూర్ణకాలనీలో జరిగింది. మల్కాపూర్ మండలం అన్నపూర్ణకాలనీ మూడో డివిజన్ 50వ బూత్ అధ్యక్షుడు పల్లికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి పీఎం మోదీ తొమ్మిదేళ్లలో చేసిన కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్, సాగి కిషన్‌రావు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి చిరంజీవి, సహ ఇన్‌చార్జి కమలాకర్, నాయకులు విజయ్, రాజు పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లెలో..

జూలపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లెలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 284 బూత్ అధ్యక్షుడు జుట్టు కిరణ్, సీనియర్ నాయకులు వొల్లె తిరుపతి యాదవ్ ఇంటింటా మోదీ సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు.

పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలి


అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: పద్మశాలీలు రాజకీయాల్లో రాణించాలని పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయిల రమేశ్ అన్నారు. సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామంలో ఎన్నికల కమిటీ చైర్మన్ గుండా మురళి ఆధ్వర్యంలో గ్రామశాఖ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా గుండా కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా గుండా వెంకటేశం, ఉపాధ్యక్షులుగా గుండా మహేందర్, రమేశ్, కోశాధికారిగా ఆడెపు సదయ్య, కార్యదర్శిగా ఆడెపు శ్రీనివాస్, రమేశ్, ప్రచార కార్యదర్శిగా రామస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనవారిని సన్మానించారు. పద్మశాలి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్గు యాదగిరి, పట్టణ అధ్యక్షుడు ఆడెపు అంబదాస్, పేగడ పర్శరాములు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నేత్రాల సేకరణలో ఆరీఫ్ సేవలు ప్రశంసనీయం


అభినందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: మరణించిన వారి నేత్రాలను సేకరిస్తూ, మరో ఇద్దరు అంధుల్లో వెలుగులు పంచేందుకు కృషి చేస్తున్న గోదావరిఖనికి చెందిన టెక్నీషియన్ షేక్ ఆరీఫ్ సేవలు ప్రశంసనీయమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు రేకులపల్లి విజయ, మినేష్ నారాయణ్ తండాన్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి కొనియాడారు. గోదావరిఖని శారదానగర్‌లో గురువారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆరిఫ్‌ను సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కణాంపురం రాజేందర్, పి.మల్లికార్జున్, ప్రతినిధులు ఎల్లప్ప, తిలక్ చక్రవర్తి, జెనిగోపాల్ త్రివేది, తానిపర్తి గోపాలరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నానేస్తం ట్రస్టు సేవలు అభినందనీయం



వైకుంఠరథం ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్, ఎంపీపీ, సర్పంచులు, ట్రస్టు సభ్యులు

ఎలిగేడు: సమాజానికి సేవ చేయాలనే తపన కొంత మందికే ఉంటుందని, ఎలిగేడులో ఎస్సెస్సీ 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నానేస్తం చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. నానేస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎలిగేడు మండల ప్రజల అవసరార్థం శుక్రవారం మండల కేంద్రంలోని మధుర ఫంక్షన్ హాల్‌లో వైకుంఠరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండల ప్రజలకు ఉపయోగపడే వైకుంఠరథాన్ని అందుబాటులోకి తెచ్చినందుకు ట్రస్టు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు పెంట శ్రీనివాస్, వెంగళదాసు అశోక్ మాట్లాడుతూ నానేస్తం ట్రస్టు ఏర్పాటు నుంచి ట్రస్టు సభ్యుల విరాళాలతో రూ.20లక్షలకు పైగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. విరాళాలు అందించిన దాతలను సన్మానించారు. సర్పంచ్‌లు సింధూజ, మాడ కొండాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ట్రస్టు మాజీ అధ్యక్షుడు దేవసాని శ్రీనివాస్, కట్ల సత్యం, భూర్ల వెంకటేశ్వర్లు, ట్రస్టు సభ్యులు తానిపర్తి సుధాకర్‌రావు, వీరగోని లక్ష్మీనారాయణ, భూసారపు శ్రీనివాస్, రంగు రాములు, పల్లె వీరస్వామి, రమేశ్, వంగ సత్యనారాయణ, శ్రీశైలం, రాజేశం, సభ్యులు, దాతలు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువ పరిశీలన


మాట్లాడుతున్న కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ: గోదావరిఖని రాజీవ్‌నగర్‌లో మురుగునీటి కాలువ వివాదం దృష్ట్యా శుక్రవారం రామగుండం మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు మురుగు కాలువను పరిశీలించి సమస్య పరిష్కారానికి తాత్కాలిక చర్యలు చేపట్టారు. 38వ, 46వ డివిజన్ల మధ్యలో ఉన్న కాల్వపై అడ్డుగా మట్టి పోయడంతో, మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన స్థానికులు గురువారం బల్దియా ఎదుట నిరసన తెలిపారు. కాగా గురువారం కురిసిన వర్షానికి కాలువ నుంచి నీరు స్థానిక నివాసాల సమీపంలోకి రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. విషయం తెలిసిన కమిషనర్ స్వయంగా కాలువను పరిశీలించారు.

నోట్‌బుక్స్ అందజేత


నోట్‌బుక్స్ అందజేస్తున్న సర్పంచ్ పద్మ

కమాన్‌పూర్(రామగిరి): కల్వచర్ల, రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు కల్వచర్ల గ్రామ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన సౌమిత్రి నారాయణచార్యులు, సౌమిత్రి వేదవ్యాసాచార్యులు, సౌమిత్రి పరంకుశా చార్యుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సుగుణ, గిరి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. కల్వచర్ల, రత్నాపూర్ సర్పంచ్‌లు గంట పద్మ, పల్లె ప్రతిమ, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, ఉపసర్పంచ్ వేము కనుకయ్య, పాఠశాల హెచ్‌ఎం వనజ, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పీవీ.రావు, కొలిపాక కనుకయ్య, సారయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ ఓదెలు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి


2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు

సుల్తానాబాద్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఇండియన్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మాటేటి సంజీవ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఒలంపిక్ డే సందర్భంగా శుక్రవారం పోలీస్‌శాఖ సహకారంతో 2కే రన్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాటేటి కృష్ణప్రియ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యసేవలు ఉపయోగించుకోవాలి

జూలపల్లి: గ్రామీణ ప్రజలు ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జ్వరాలు వస్తున్నాయని ఇచ్చిన సమాచారంతో కాలనీలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి 50మందికి రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి

కమాన్‌పూర్(రామగిరి): రామగిరి మండలంలోని బేగంపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఆరెల్లి దేవక్క కోరారు. పీహెచ్‌లో ఎంపీపీ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో రామ్‌సింగ్, డీడీవో సంపత్, మెడికల్ ఆఫీసర్ సంపత్ మాట్లాడారు. పీహెచ్‌సీలో వివిధ పనులు చేపట్టడానికి కలెక్టర్ రూ.4.25లక్షల నిధులు మంజూరు చేసినా.. పనులు పూర్తిస్థాయిలో చేయకపోవడంలో లోవోల్టేజీ సమస్యతో పీహెచ్‌సీలోని పరికరాలు కాలిపోతున్నాయని తెలిపారు. 108 అంబులెన్స్ అందుబాటులో ఉండేవిధంగా చూడాలని కోరారు. సర్పంచ్‌లు బుర్ర పద్మ, పల్లె ప్రతిమ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్

పెద్దపల్లిరూరల్: శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజం మహంత, నగర అధ్యక్షుడు, పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌తో పాటు నాయకులు సంపత్‌రావు, మంతెన కష్ణ, ఎర్రోళ్ల శ్రీకాంత్, సయ్యద్ ఫయాజ్, సోడా బాబు, మధు, వినయ్, కుమార్, వేణు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: శ్యామాప్రసాద్ బలిదాన్ దివస్ సందర్భంగా మంథనిలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ నాంపల్లి రమేశ్, పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, నాయకులు కొండపాక సత్యప్రకాష్, శ్రీనివాస్, సంతోష్ ఉన్నారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కూలీ సంఘం సభ్యులు

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, పంట రుణాలు మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అంతర్గాం తహసీల్దార్ కత్రోజు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మేర్గు చంద్రయ్య, కొల్లూరి మల్లేశ్, వేల్పుల సాంబయ్య, రాజకొమురయ్య, మురుకుంట్ల శ్రీనివాస్, మొండయ్య, అంజయ్య, లింగయ్య, ఖాజామియా తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని మూడు గేదెలు మృతి

మంథని: లారీ ఢీకొని మూడు గేదెలు మృతిచెందగా మరో మూడింటికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంథని మున్సిపాలిటీ పరిధి లైన్‌గడ్డకు చెందిన రైతు సింగనవేన లింగేష్‌కు 16 గేదెలు న్నాయి. వాటి ద్వారా వచ్చే పాలతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం 11 గేదెలు మేతకు వెళ్లగా ఐదు మాత్రమే ఇంటికి వచ్చాయి. లింగేష్ మిగతా వాటి కోసం వెతకగా గంగాపురి సమీపంలో కనిపించాయని చూసినవాళ్లు చెప్పారు. అతను వాటిని ఇంటికి తోలుకు వస్తుండగా పెద్దపల్లి–మంథని ప్రధాన రహదారిపై ఎస్టీ గురుకుల కళాశాల వద్ద పెద్దపల్లి నుంచి మంథని వైపు వస్తున్న టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో మూడు తీవ్రంగా గాయపడ్డాయి. రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని, తాను జీవనాధారం కోల్పోయానని బాధితుడు కన్నీరు పెట్టుకున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, స్థానికులు రహదారిపై ధర్నా చేపట్టారు. గేదెలను ఢీకొన్న లారీని పట్టుకున్నామని పోలీసులు సమాచారం ఇవ్వడంతో శాంతించారు.

అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారంలో బాలవికాస నేతృత్వంలో శుక్రవారం అంతర్జాతీయ వితంతు దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలవికాస కోఆర్డినేటర్ నరేశ్, సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ మానస, ఉపసర్పంచు మేడి తిరుపతి, నాయకులు అశోక్‌గౌడ్, వేమారెడ్డి, రమేశ్, మల్లయ్య, విమల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ మసీద్ కమిటీ అధ్యక్షుడిగా ఆయాజుద్దీన్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ జామా మసీద్ కమిటీ అధ్యక్షుడిగా ఆర్జీ–2 ఏరియా వకీల్‌పల్లిగని లోహెడ్ ఓవర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయాజుద్దీన్‌ను ఎన్నుకున్నారు. మసీద్ ఆవరణలో శుక్రవారం సలహాదారుల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

✦ పురోహిత సంఘం ఎన్నికలు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం రామగుండం నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ పురోహిత సంఘం ఎన్నికలు అడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా గోపాలచారి, ప్రధాన కార్యదర్శిగా మహేంద్రచారి గెలుపొందారు. సభ్యులు సదానందచార్యులు, నర్సింహచార్యులు, సుహ్మాంచార్యులు, వెంకటరమణచార్యులు, వీరాచారి, విజయ్ కుమారచార్యులు, సుధాకర్ పాల్గొన్నారు.

✦ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రామగుండం: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్ ఎంఈవో సంపత్‌రావును కోరారు. రామగుండం మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల ఉపాధ్యాయ సంఘం బాధ్యులతో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో అనుసంధాన సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఈవోను సన్మానించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్, పాలకుర్తి మండల బాధ్యులు కె.కుమారస్వామి పాల్గొన్నారు.


✦ యువకుడి ఆత్మహత్యాయత్నం

మంథని: మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన మీసాల సంతోష్ మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బ్లేడ్‌తో మణికట్టు వద్ద కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో మైదానంలో పడి ఉన్న అతడిని స్థానికులు గమనించి డయల్ 100 సమాచారం అందించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు. సంతోష్ మద్యానికి బానిసై కొంతకాలంగా ఖాళీగానే తిరుగుతున్నట్లు సమాచారం. ఘటన జరిగిన సమాచారం ఉందని, కానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

✦ మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గోదావరిఖని: పెళ్లికాలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన అడ్లూరి శివరాం(37) పెళ్లి కాలేదనే మనస్తాపంతో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 'ఖని' వన్‌టౌన్ ఎస్సై స్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగావకాశాలు


సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపాల్

పెద్దపల్లిరూరల్: వృత్తి నైపుణ్యం ఉన్న వారికే ఉద్యోగావకాశాలు వస్తాయని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శిక్షణ పొందిన వారికి ప్రిన్సిపాల్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కోటేశ్వర్‌రావు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదై ఉన్న కార్మికుల పిల్లలకు ఉచిత కెరీర్ గైడెన్స్, రెజ్యూమ్ ప్రిపరేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. యాప్ ద్వారా 46 కోర్సుల్లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలను అందిస్తుందని వివరించారు. మొత్తం 225 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు వెల్లడించారు.